సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



బాస్కెట్‌బాల్‌లో జయకేతనం
రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు జయకేతనం ఎగరేసింది. చాంపియన్‌షిప్ సాధించింది. 8లో ▸



వైద్యుల నిర్లక్ష్యంతో..
బుట్టాయగూడెం మండలంలోని తుమ్మిలేరు గ్రామానికి చెందిన గర్భిణికి సకాలంలో వైద్యం అందక ఆమెతో పాటు కడుపులో శిశువు కూడా మృతిచెందాడు. 8లో ▸



హ్యాండ్‌బాల్ విజేత సీఆర్‌ఆర్
జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల పురుషుల విభాగంలో ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల జట్టు విజయం సాధించింది. 8లో ▸

చిత్తడి నేలలు.. పర్యావరణ నేస్తాలు

- రేపు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం
- తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు
- 3న ఆటపాకలో బర్డ్స్ ఫెస్టివల్, విద్యార్థులతో ఈవెంట్
- భవిష్యత్తు కోసం చిత్తడి నేలల రక్షణ నినాదంతో కార్యక్రమాలు


కొల్లేరులో చిత్తడి నేలల ప్రాంతం


కొల్లేరులో సంప్రదాయ దోనెపై వేట

కైకలూరు: ఉపరితలంపై ఏడాది పొడవునా ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. ఇవి జీవరాశుల మనుగడకు అనువైనవి. ఇరాన్‌లోని రామ్‌సర్ నగరంలో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన అంతర్జాతీయ చిత్తడి నేలల సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వీటి ఆవశ్యతను గుర్తించారు. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో 85 రామ్‌సర్ సైట్లలో 13,688.0903 హెక్టార్లలో చిత్తడి నేలలు ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 3,719.08 హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే చిత్తడి నేలలగా రామ్‌సర్ గుర్తించిన ఏకైక కొల్లేరు సరస్సు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యాపించి ఉంది.

కొల్లేరు నిలయం
కొల్లేరు ప్రాంతంలో 2,22,689 ఎకరాల విస్తీర్ణాన్ని 2002 ఆగస్టు 19న రామ్‌సర్ సైట్‌గా గుర్తించారు. చిత్తడి నేలల నిలయమైన కొల్లేరుకు ఆస్ట్రేలియా, నైజీరియా, ఈజిప్టు, ఇండోనేషియా వంటి దేశాల నుంచి వలస పక్షులు విడిదికి వస్తున్నాయి. ప్రపంచ పెలికాన్ పక్షుల్లో 40 శాతం శీతాకాలంలో కొల్లేరుకు రావడానికి చిత్తడి నేలలే కారణం. కొల్లేరులో దాదాపు 182 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, కావేరి, హిమాలయాలు వంటి ప్రాంతాల్లో సరస్సులు, మడ అడవులు, పరీవాహక ప్రాంతాలు చిత్తడి నేలల కోవలోకి వస్తాయి. ఈ ఏడాది 'భవిష్యత్తు కోసం చిత్తడి నేలలను రక్షించడం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 56.25 హెక్టార్లు పైగా విస్తీర్ణంలో 1,943 చిత్తడి నేలలు 3,719.08 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

ప్రమాదంలో చిత్తడి నేలలు
ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్-పాలసీ ప్లాట్‌ఫాం ఆన్ బయోడైవర్సిటీ అండ్ ఎకో సిస్టమ్ సర్వీసెస్ (ఐపీబీఈఎస్) గ్లోబల్ అంచనా ప్రకారం చిత్తడి నేలలు అడువుల కంటే మూడు రెట్లు వేగంగా కనుమరుగవుతున్నాయి. చిత్తడి నేలలు భూ ఉపరితలంపై 6 శాతం మాత్రమే ఉన్నా మొత్తం వృక్ష, జంతు జాతులలో 40 శాతం చిత్తడి నేలల్లోనే నివసిస్తున్నాయి. అడవుల నరికివేత, రసాయనాల వాడకం, ఆక్రమణలు వల్ల చిత్తడి నేలలు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కొల్లేరు సరస్సులో ఆక్రమణలను మూడు నెలల్లో తొలగించాలని సుప్రీంకోర్టు రాష్ట్రం ప్రభుత్వానికి ఆదేశించడానికి కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడమే ప్రధాన కారణం.

చిత్తడి నేలలు.. ఉపయోగాలు


కొల్లేరులో పక్షులు

- వరదలను నియంత్రిస్తాయి.
- ఫిల్టర్ మాదిరిగా నీటిని శుద్ధి చేస్తాయి. అందుకే వీటిని ప్రకృతి మూత్ర పిండాలుగా వర్ణిస్తారు.
- మట్టిలోని ఉత్పాదక సారాన్ని పెంచుతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులతో పాటు, జీవరాశులన్నింటికీ అనువైన వాతావరణం.
- ఔషధ గుణాలున్న మొక్కల పెరుగుదలకు తోడ్పడతాయి.
- రసాయనిక, జెనెటిక్ పదార్థాలను ఇముడ్చుకుని, తిరిగి నేలను మార్పు చేస్తాయి.
- అత్యధిక జీవరాసులకు ప్రధాన ఆవాస కేంద్రంగా ఉంటాయి.
- ఎక్కువ కాలం నీటి నిల్వకు, భూమి లోపలి నీటి శాతాన్ని పెంచేందుకు దోహదపడతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులకు, పక్షులకు నిలయాలుగా ఉన్నాయి.
- చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత అని రామ్‌సర్ సదస్సు పిలుపునిచ్చింది.

పరిరక్షణ అందరి బాధ్యత



చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరును పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. కొల్లేరు ప్రాంతానికి ఈ ఏడాది ఎక్కువగా వలస పక్షులు వచ్చాయి. ఫిబ్రవరి 2న చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశాం.
– బి.విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు

పరిజ్ఞానం పెరగాలి



విద్యార్థుల్లో పర్యావరణ పరిజ్ఞానం పెరగాలి. ఫిబ్రవరి 3న అటవీశాఖ, వరల్డ్ వైల్డ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంయుక్తంగా 500 మంది విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కలిగించనున్నాం. ఆటపాకలో బార్డ్స్ ఫెస్టివల్‌తో పాటు బంకమట్టితో పక్షి బొమ్మల తయారీ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నాం.
– ఫరీదా టాంపాల్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, రాష్ట్ర డైరెక్టర్, హైదరాబాద్

లోకాయుక్తలో ఫిర్యాదుపై విచారణ


కాళ్ల మండలం ఏలూరుపాడులో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ల: ఏలూరుపాడు పంచాయతీలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఉప సర్పంచ్ భర్త నల్లగచ్చు నాగార్జున లోకాయుక్తలో చేసిన ఫిర్యాదుపై భీమవరం డివిజనల్ పంచాయతీ అధికారి సీహెచ్ బాలాజీ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్ల మండలం ఏలూరుపాడులోని మంచినీటి చెరువుకు ఉన్న ఫెన్సింగ్ తొలగించి, చెరువు మట్టి అక్రమంగా తవ్వి అమ్మేసుకున్నారని, జగనన్న కాలనీలో మట్టి నాలుగు అడుగుల మేర తీసివేశారని, ఆ పక్కనే ఉన్న చెరువులో అక్రమంగా ఉప్పునీటి బోరు వేశారని, మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న మురుగుడ్రైన్‌లో డబ్బులు తీసుకుని తూములు ఉంచేశారని, దీనికి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, వీఆర్వో, సెక్రటరీలను బాధ్యులని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిలో భాగంగా సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేశామన్నారు. అలాగే క్షేత్రస్థాయిలోనూ పరిశీలించామని డీఎల్‌పీఓ చెప్పారు. పూర్తిస్థాయి విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించనున్నట్టు స్పష్టం చేశారు. ఈఓపీఆర్డీ ఎంవీ భాస్కరరావు, సర్పంచ్ బీహెచ్ జగ్గరాజు, ఎంపీటీసీ సీహెచ్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవి, ఎఫ్‌డీఓ ఇందిరా, ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్, వీఆర్వో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నాబార్డు ద్వారా ఉపాధి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం: నాబార్డు ద్వారా విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు పలు కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి బి.అనిల్ కాంత్ తెలిపారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో నాబార్డు అగ్రిక్లినిక్స్, అగ్రిబిజినెస్ సెంటర్స్ పథకంపై బీఎస్సీ (ఆనర్స్) విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన, వ్యవసాయ రంగాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు నాబార్డు బ్యాంకు, మేనేజ్ సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. భూసార, నీటి నాణ్యత పరీక్ష ల్యాబ్‌ల ఏర్పాటు, నర్సరీల నిర్వహణ, టిష్యూ కల్చర్ బ్యాంకుల ఏర్పాటు, సేంద్రియ, జీవన ఎరువుల తయారీ, జీవ నియంత్రణ కారకాల తయారీ, తేనె పరిశ్రమ, ఫుడ్ ప్రోసెసింగ్ వంటి 30 రంగాల్లో స్వయం ఉపాధికి వ్యక్తిగతంగా రూ.20 లక్షల వరకు, సమూహంగా రూ.కోటి వరకు రుణాలు అందిస్తామన్నారు. యూనియన్ బ్యాంకు జిల్లా అధికారి ఎ.నాగేంద్రప్రసాద్ మాట్లాడారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఏవీడీ దొరాజీరావు, సమన్వయకర్తలు ఉమాకృష్ణ, ఈ.కరుణశ్రీ, ఆర్‌వీ సుజాత, అర్చన, శేఖర్ పాల్గొన్నారు.

'ఓపెన్' ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

భీమవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్ష తేదీలను ప్రకటించినట్లు డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. మార్చి 3న ఇంగ్లిష్, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణకశాస్త్రం, 15న జీవశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, గృహవిజ్ఞాన శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

నేటి నుంచి ఇంటర్ క్వాలిఫయింగ్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఈనెల 1, 3 తేదీల్లో క్వాలిఫయింగ్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 1న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు చదివే కాలేజీల్లోనే పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 137 కళాశాలల్లో 18,453 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. గతంలో ఈ పరీక్షలు రాయకున్నా, ఫెయిలైన విద్యార్థులు కూడా గత పరీక్షల హాల్‌టికెట్‌తో హాజరు కావచ్చని చెప్పారు.

డీన్ అకడమిక్‌గా చిరంజీవి

నూజివీడు: నూజివీడు ట్రిపుల్‌ఐటీ డీన్ అకడమిక్‌గా సీఎస్ఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ చిరంజీవి నియమితులయ్యారు. ఇప్పటివరకు పనిచేస్తున్న రత్నాకర్ పదవీ కాలం పూర్తికావడంతో చిరంజీవిని నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రత్నాకర్‌ను అధికారులు సత్కరించారు. ట్రిపుల్‌ఐటీలో ఈసీఈ విద్యార్థులు 80 మంది ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా మంగళగిరి వద్ద ఉన్న ఎఫ్ ట్రానిక్స్ కంపెనీని సందర్శించారు.

8 నుంచి నారసింహుని కల్యాణోత్సవాలు


లక్ష్మీనరసింహ స్వామి

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రానికి దత్తత ఆలయం మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 10న ఉదయం కొండ కింద కల్యాణ మండపంలో దివ్యకల్యాణ ఉత్సవాన్ని జరిపిస్తారు. 11న సాయంత్రం గ్రామోత్సవం, 12న పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, పూర్ణాహుతి వేడుకలు జరుగుతాయి. 13న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ తెలిపారు.

కలెక్టరేట్ ఏర్పాటులో రాజకీయ జోక్యం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ధ్వజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత నాగేశ్వరరావు

భీమవరం: జిల్లా కేంద్రం భీమవరంలో శాశ్వతంగా కలెక్టరేట్ ఏర్పాటు వెనుక రాజకీయ జోక్యం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో కలెక్టరేట్ స్థల మార్పు అంశంపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కలెక్టరేట్‌ను జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డు స్థలంలో శాశ్వతంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినప్పుడల్లా రాజకీయ నాయకులు స్వప్రయోజనాల కోసం కలెక్టరేట్‌ను మారుస్తారా అంటూ ప్రశ్నించారు. కలెక్టరేట్‌ను మార్పు చేస్తే అఖిలపక్ష నాయకులతో కలిసి ఆందోళనలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీఓను రద్దు చేసి పట్టణానికి దూరంగా, ప్రజలకు అందుబాటులో లేచిచోటుకు కలెక్టరేట్‌ను తరలింపునకు ప్రయత్నిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రహస్యంగా, ఎక్కడో స్థలం కేటాయించి కలెక్టరేట్‌ను ఎందుకు మార్చాలనుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు, మాజీ ఎమ్మెల్యే, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నాయకుడు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకుడు లంకా కృష్ణమూర్తి, సీపీఐ (యు) జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి, ఐఏసీ నాయకుడు కాకర రాజశేఖర్, సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వంచనలో ఘనుడు చంద్రబాబు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వంచన, కుట్ర, మోసం చేయడంలో సీఎం చంద్రబాబుని మించిన నాయకుడు లేడని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దుయ్యబట్టారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పటిలానే అబద్ధాలు చెప్పి మరోసారి అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో 9 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందక విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు అసమర్థుడని మరోసారి రుజువైందన్నారు.

జగన్‌పై దుష్ప్రచారం
జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ దుష్ప్రచారం చేశారని కొట్టు అన్నారు. అప్పులపై అబద్ధాలు ప్రచారం చేశారని విమర్శించారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తాము కొనసాగిస్తూనే అదనంగా సూపర్ సిక్స్ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి, ఇప్పుడు తుంగలో తొక్కారని మండిపడ్డారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 పథకానికి రూ.37,300 కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ.12,450 కోట్లు, రైతులకు అన్నదాత సుఖీభవకు రూ.10,706 వేల కోట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతిని ఇస్తామన్న ఎన్నికల హామీని యువనేత లోకేష్‌బాబు ఎంతవరకు తీసుకువచ్చారని మాజీ మంత్రి కొట్టు ప్రశ్నించారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యం : కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారని కొట్టు అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను విస్మరిస్తున్నారన్నారు. 8 నెలల్లో రూ.1.19 లక్షల కోట్లు అప్పు చేసి, ఈ సొమ్ములను అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ ఒకరోజు గెడ్డం, మరో రోజు కాషాయ వస్త్రాలు ధరిస్తూ హిందూ ధర్మమని ఒకసారి, తన తండ్రి నాస్తికుడని మరోసారి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలకు సంబంధించని విషయాల్లో తలదూర్చి సీజ్ ద షిప్ అంటూ సినిమా డైలాగులు కొడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించిందని, దీని వల్ల పూర్తి ప్రయోజనం రైతులకు కలగదని కొట్టు సత్యనారాయణ అన్నారు.

ఏసీబీ వలలో చిక్కిన హాస్టల్ వార్డెన్

- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వద్ద రూ.30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన వార్డెన్, ఆమె భర్త


ఏసీబీ అదుపులో హాస్టల్ వార్డెన్ పోతుల నాగమణి, ఆమె భర్త జాదం రామోజీరావు

నూజివీడు: నూజివీడులోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్) పోతుల నాగమణి గురువారం రాత్రి ఏసీబీ వలకు చిక్కారు. హాస్టల్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏలూరు ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ఏలూరు డీఎస్పీ సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పండా ఝాన్సీ అనే మహిళ హాస్టల్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో హౌస్ కీపింగ్, శానిటేషన్ విభాగంలో ఐదేళ్లుగా పనిచేస్తోంది. వార్డెన్ పోతుల నాగమణి రూ.లక్ష ఇస్తేనే హాస్టల్‌లో పనికి రానిస్తానని ఝాన్సీని రెండు నెలలుగా వేధిస్తున్నారు. అంత ఇవ్వలేనని, రూ.30 వేలు ఇస్తానని ఝాన్సీ బతిమాలడంతో నాగమణి ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఝాన్సీ ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. వారి సూచన మేరకు ఝాన్సీ గురువారం రాత్రి నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలోని వార్డెన్ ఇంటి వద్దకు వెళ్లి రూ.30 వేలు ఇవ్వగా, ఆ మొత్తాన్ని వార్డెన్ భర్త జాదం రామోజీరావు బీరువాలో పెడుతుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. రాత్రంతా అక్కడే ఉండి రికార్డు తయారు చేసి వార్డెన్ నాగమణి, రామోజీరావులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం, ఏసీబీ కోర్టులో హాజరుపరిచేందుకు వారిని విజయవాడకు తరలించారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, ఎన్‌వీ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి


శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రిటైర్డ్ న్యాయమూర్తులు, ఎంపిక చేసిన న్యాయవాదులు, సోషల్ వర్కర్లకు నిర్వహించిన మధ్యవర్తుల శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ కేసుల త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని, శిక్షణను సద్వినియోగం చేసుకుని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కొన్ని కేసుల్లో అవగాహన లోపంతో రాజీపడటం లేదని, కౌన్సెలింగ్ ద్వారా కేసులను త్వరగా పరిష్కరించవచ్చన్నారు. రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, జాతీయ న్యాయ అధికార సంస్థ, న్యూఢిల్లీ రిసోర్స్ పర్సన్ పుష్పగుప్తా, దీపక్ డింగరా పాల్గొన్నారు.


భక్తుల గ్రామోత్సవం


హోమాలు చేస్తున్న మాలధారులు

వాసవీ మాత.. ఆరాధ్య దేవత


అలంకరణలో మూల విరాట్ వాసవీ మాత

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దిన కార్యక్రమం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. వాసవీ మాత జన్మస్థలమైన పెనుగొండ శుక్రవారం ఉదయం దేశం నలుమూలల నుంచి వచ్చిన వాసవీ మాలధారులు, భక్తులతో కిక్కిరిసిపోయింది. జై వాసవీ.. జైజై వాసవాంబ.. స్మరణలు మార్మోగాయి. ఉదయం వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో పెనుగొండ రామాలయం నుంచి 102 కలశాలతో మహిళలు, వాసవీ మాలధారులు భారీ ఊరేగింపుగా మూలవిరాట్ వాసవీ మాత ఆలయానికి తరలి వచ్చారు. వెండి పల్లకిలో వాసవీ మాతను, పట్టువస్త్రాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వాసవీ మాతాకు అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మండపంలో వాసవీ మాలధారులు దీక్షలు విరమించారు. వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో హోమక్రతువులు నిర్వహించారు. వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాలధారులకు ఏర్పాట్లను సంఘ అధ్యక్షుడు ఉద్దగిరి శ్రీధర్(దత్తు), ఉపాధ్యక్షుడు నితిన్ బాబీ, సంఘ సభ్యులు పర్యవేక్షించారు.

గళమెత్తిన పోలవరం నిర్వాసితులు

వేలేరుపాడు: ఏటా గోదావరి వరదలకు గ్రామాలు నీటమునుగుతున్నాయి.. తాము సర్వస్వం కోల్పోతున్నాం.. అయినా ప్రభుత్వం తమ గ్రామాలను 45 కాంటూరులో చేర్చిందంటూ శుక్రవారం నిర్వాసితులు ఆందోళనకు దిగారు. వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మండలంలోని ఎర్రబోరు, సుద్దగుంపు, తాట్కూరు గొమ్ముకాలనీ, నడిమిగొమ్ము కాలనీ, పాతపూచిరాల, పడమటిమెట్ట, చాగరపల్లి, కొర్రాజులగూడెం, గీగావారిగుంపు, మద్దిగట్ల తదితర గ్రామాల ప్రజలతో ప్రభుత్వం ఆటలాడుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సత్యనారాయణ అందుబాటులో లేరని సిబ్బంది చెప్పడంతో తహసీల్దార్ కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లి అధికారులను దిగ్బంధనం చేశారు. ముందుగా చాగరపల్లి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్ఐ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

హనుమ వాహనంపై శోభనాచలుడి దర్శనం



హనుమంత వాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీ నరసింహ స్వామి

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి మాఘ మాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్వామివారు హనుమంతుని వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి హనుమంతు వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, జి.అనంత కృష్ణ, వేద పండితులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణ అధికారి సాయి పర్యవేక్షించారు.

గోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభం



గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో గోటి తలంబ్రాల కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఆర్‌వీ చందన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త కేఎల్‌ఎస్ ధనకుమార్ మాట్లాడుతూ శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవానికి తలంబ్రాల నిమిత్తం ధాన్యం గోటితో వలిచే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కామవరపుకోట : గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం కామవరపుకోటలో జరిగింది. స్థానికులు, తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున కామవరపుకోట నుంచి ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డులో గ్రోమోర్ ఎరువుల దుకాణం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో సుమారు 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా జయకేతనం

ఫైనల్‌లో తూర్పుగోదావరిపై బాలికల జట్టు గెలుపు



ఫైనల్‌లో తూర్పుగోదావరి జట్టుతో తలపడుతున్న పశ్చిమ జట్టు బాలికలు



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకున్న బాలికలు

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు జయకేతనం ఎగరేసింది. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మొట్టమొదట సారి నిర్వహిస్తున్న అండర్-23 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీని సొంతం చేసుకుంది. ఈ నెల 28 నుంచి 31 వరకూ విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఫస్ట్ అండర్-23 పురుషుల, మహిళలు బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా బాలికల జట్టు వరుస విజయాలతో అభిమానులను అలరించింది. శుక్రవారం సాయంత్రం స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ కోర్టులో తూర్పు గోదావరి జిల్లా జట్టుతో ఫైనల్‌లో తలపడింది. షూటింగ్, పాసింగ్, రన్నింగ్ షాట్ అంశాల్లో జిల్లా బాలికలు ప్రతిభ కనపరిచారు. 47-17 స్కోర్ తేడాతో విజయం సాధించి చాంపియన్లుగా నిలిచారు. దీనికి ముందు జరిగిన లీగ్ పోటీల్లో శ్రీకాకుళం జట్టుపై 54-26, చిత్తూరుపై 52-14, గుంటూరుపై 45-42 స్కోర్‌తో గెలిచింది. క్వార్టర్‌ఫైనల్‌లో బలమైన అనంతపురం జట్టును సైతం 44-11 స్కోర్‌తో, సెమీఫైనల్‌లో విశాఖపట్టణం జట్టును 59-28 స్కోర్‌తో ఓడించడం విశేషం. కోచ్ మురళీకృష్ణ సలహాలు, సూచనలతో జిల్లా బాలికలు పక్కా డిఫెన్స్‌తో ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం సాధించి అభిమానుల మన్ననలు అందుకున్నారు. మరోపక్క జిల్లా పురుషుల జట్టు లీగ్ మ్యాచ్‌ల్లో గెలిచి, క్వార్టర్‌ఫైనల్‌లో అనంతపురం జట్టు చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. బాలికల విజయంపై బాస్కెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, రమేష్, సత్యం సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ విజేతలు

భీమవరం: చిన్నతనం నుంచి క్రీడల పట్ల మక్కువ చూపిస్తే ఆరోగ్యంగా ఉండడమే గాక జీవిత కాలం పెరుగుతుందని గుంటూరుకు చెందిన టెన్నిస్ క్రీడాకారుడు సీహెచ్ విల్సన్‌బాబు అన్నారు. పట్టణంలోని యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కనుమూరు సూర్యనారాయణరాజు మెమోరియల్ అండర్-16 బాల, బాలికల ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి యూత్ క్లబ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. యూత్‌క్లబ్ అధ్యక్షుడు, ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు కెనడాకు చెందిన ప్లేయర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందచేశారు. గుంటూరుకు చెందిన క్రీడాకారిణి గోలి జ్యోషితకు టెన్నిస్ శిక్షణ పొందడానికి నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మంతెన సూర్యనారాయణరాజు(పండు), ఉపాధ్యక్షుడు పేరిచర్ల వెంకటశ్రీనివాసరాజు(సుభాష్), జాయింట్ సెక్రటరీ వేగేశ్న రామకృష్ణంరాజు, టోర్నమెంట్ డైరెక్టర్ జీవీకే శివకుమార్‌రాజు, డీఎస్ రాజు, కేవీ సత్యనారాయణరాజు(సత్తులు) తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో శాన్వి (తెలంగాణ)పై సెలిన్ (ఏపీ) 7-6, 6-1 స్కోరుతో విజయం సాధించింది. బాలుర విభాగంలో విఘ్నేష్ (తమిళనాడు)పై పార్థివ్ (టీఎస్) 5-7, 7-5, 6-0 గెలుపొందాడు. డబుల్స్ విభాగంలో ఆద్య, గౌరీశ్రీపై గోలి జోషిత, తనుశ్రీ జోడి 7-6, 6-0 స్కోరుతో గెలుపొందారు. పార్థివ్, భవేష్‌పై విఘ్నేష్, ధ్రువ్ జోడి 6-1, 6-1 స్కోరుతో విజయం సాధించింది.

హ్యాండ్‌బాల్ పోటీల విజేతగా సీఆర్‌ఆర్



విజయం సాధించిన బాలుర జట్టు



గెలుపొందిన బాలికల జట్టు

దెందులూరు: జేఎన్టీయూ కాకినాడ అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల పురుషుల విభాగంలో ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల విజయం సాధించగా హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. మహిళల విభాగంలో రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల విజయం సాధించగా సీఆర్‌ఆర్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో సెట్‌వెల్ సీఈఓ ప్రభాకరరావు, ప్రభుత్వ వ్యాయామ కళాశాల గోపన్నపాలెం ప్రిన్సిపాల్ ఎన్.నతానియేలు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బీ.శ్రీనివాసులు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి, శిశువు మృతి





సకాలంలో వైద్యం అందక మృతిచెందిన మధుబాల

బుట్టాయగూడెం: మండలంలోని రామన్నగూడెం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ నిర్వాసిత కాలనీలో తుమ్మిలేరు గ్రామానికి చెందిన గర్భిణికి సకాలంలో వైద్యం అందక ఆమెతో పాటు కడుపులో బిడ్డ కూడా మృతిచెందాడు. సర్పంచ్ అందెల సీతారామిరెడ్డి, భర్త అబ్బాయిరెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుబాల(23) 9 నెలల గర్భిణి. గురువారం ఆమెకు నొప్పులు రావడంతో భర్త నందాపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వైద్యులు మధుబాలను బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి వైద్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయగా.. అక్కడ ఏలూరు ఆస్పత్రికి వెళ్లాలని చెప్పారు. అక్కడ వీల్‌చైర్ మీదే వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. పరీక్షలు చేసిన వైద్యులు కడుపులో బిడ్డ హార్ట్‌బీట్ తక్కువగా ఉందని చెప్పి అర్జెంట్‌గా ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో రక్తస్రావం ఎక్కువగా కావడంతో మధుబాలతోపాటు శిశువు కూడా మృతి చెందినట్లు భర్త అబ్బాయిరెడ్డి తెలిపారు. తన భార్య మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో మధుబాలకు రక్తం తక్కువగా ఉందని పరీక్షిస్తామని చెప్పిన డాక్టర్‌లు సకాలంలో రాలేదని ఆరోపించారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళి వైద్యం చేయించుకుంటామన్నా వినలేదని అబ్బాయిరెడ్డి రోధించాడు. వైద్యుల నిర్లక్ష్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అందెల సీతారామిరెడ్డి, వేట్ల ముత్యాలరెడ్డిలు డిమాండ్ చేశారు.

బీసీలకు దక్కని గుర్తింపు



ఉంగుటూరులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరావు

ఉంగుటూరు : ఓబీసీలకు సరైన గుర్తింపు దక్కడం లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పాలక వర్గాలు బీసీ వ్యతిరేక ఆలోచన ధోరణిలో ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కులగణన ఉన్నప్పటికి ప్రభుత్వం చేపట్టడం లేదని విమర్శించారు. కులగణన వద్దని ఏ కోర్టు చెప్పలేదని.. ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. అంతకముందు ఉంగుటూరు బీసీ సంక్షేమ సంఘ సమావేశానికి బీసీ నాయకడు తాడిశెట్టి శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శంకరావు మాట్లాడుతూ సంక్షేమ సంఘం ఆశయాలు వివరించారు. బీసీలంతా ఐక్యంగా పోరాడితే ఫలితాలు బాగుంటాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి డా.దాసరి శ్యామ్ చంద్ర శేషు, శెట్టి బలిజ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణం



సిద్ధాపురంలో రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం

ఆకివీడు: కొల్లేరు సరస్సు తీరంలోని సిద్ధాపురం గ్రామంలో మంచినీటి చెరువు తవ్వుతుండగా బయటపడిన మహా శివలింగాన్ని పూరి గుడిసెలో ఉంచి పూజలు చేస్తున్నారు. ఇప్పుడు గ్రామస్తులు, భక్తులు, దాతల సహకారంతో శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన శివలింగాన్ని తెలుగు రాజులు కొల్లేరు తీరంలో ప్రతిష్ఠించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకూ ఐదు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమ మహోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామి వార్ల విగ్రహాలతో పాటు గణపతి, శివుడు, అమ్మవారు, నంది, ధ్వజము, బలిపీఠము, చండీశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీకృష్ణ అయ్యప్ప, కనకదుర్గ, కాల భైరవుడు, నవగ్రహాలు, నాగ బంధము విగ్రహాల్ని ప్రతిష్ఠిస్తారని ఆలయ అభివృద్ధికమిటీ చైర్మన్ భూపతిరాజు తిమ్మరాజు చెప్పారు.


బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత




బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ సత్య శ్రీనివాస్

నూజివీడు: పట్టణ పరిధిలోని మైలవరం రోడ్డు ట్రిపుల్ ఐటీ వద్ద తచ్చాడుతున్న 12 ఏళ్ల బాలుడిని పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ గమనించి అతని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ సత్యశ్రీనివాస్ ట్రిపుల్‌ఐటీ వైపు వెళ్తుండగా అదే మార్గంలో కంగారు పడుతూ రోడ్డు వెంట ఉన్న బాలుడిని సీఐ గమనించారు. బాలుడిని పిలిచి వివరాలు అడగగా తన పేరు కంచర్ల ప్రణవ్‌సాయి అని, కొత్తపేటలో ఇల్లు అని ఇంట్లో చెప్పకుండా వచ్చానని తల్లిదండ్రుల పేర్లు తెలిపాడు. వెంటనే సీఐ వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందజేసి వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని వారికి అప్పగించారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం






పిచ్చికుక్క దాడిలో గాయపడిన చంద్ర నాయుడు, గాయపడిన గాలి లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో సాలిపేట ఏరియా సీఎస్‌ఆర్ మల్టిప్లెక్స్ సమీపంలో శుక్రవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 8 మందిపై దాడి చేసింది. దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చంద్ర నాయుడుకు చెవి, కన్నుపై తీవ్ర గాయం కాగా, గాలి లక్ష్మి ముఖంపై గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బేబీ కమల పర్యవేక్షణలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు. శారద, సత్యనారాయణ, కృష్ణవేణి, సీతారామయ్య, నవీన్, నాగేశ్వరరావు గాయపడ్డారు. వీరికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేశారు. ఘటనా స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారి వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలో వీధి కుక్కల సంచారంపై ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా జరిగిన ఘటనతో కుక్కల సంచారంపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకం



చల్లచింతలపూడిలో మట్టి తవ్వుతున్న దృశ్యాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దెందులూరు మండలంలోని చల్ల చింతలపూడిలో టీడీపీ నాయకులు సాగు భూమిలో అనుమతి లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. మండల జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలోని గ్రామంలో మట్టి తవ్వుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు మౌనంగా ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం రైతులు అధికారులకు దరఖాస్తు చేయటం మండల, జిల్లా అధికారులు పరిశీలన, లిఖిత పూర్వక అనుమతులు మంజూరు అనంతరం తవ్వుతారు. చల్ల చింతలపూడిలో సాగు భూమి ఉన్న వ్యక్తి విజయవాడలో ఉంటున్నారు. ఆయన అల్లుడికి స్థలం లీజుకు ఇచ్చారు. శుక్రవారం ఆ పొలంలో మట్టి తవ్వుతుండగా విజయవాడ నుంచి యజమాని వచ్చి పనులు ఆపాలని కోరిన నేపథ్యంలో ఘర్షణ జరిగింది. అనంతరం మట్టి తవ్వకాలను నిలుపుదల చేశారు.

పెద్దింట్లమ్మ జాతర పనులు ప్రారంభం



పందిరి రాటను పాతుతున్న గ్రామస్తులు

కై కలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర పనులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి 13 వరకు అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పందిరిరాట కార్యక్రమానికి పందిరిపల్లిగూడెం సర్పంచ్ బలే వెంకటరమణ, ఎంపీటీసీ బలే నాగమణి, గ్రామ పెద్దలు జల్లూరి వెంకన్నబాబు, ఘంటసాల సీతారామాంజనేయులు, సముద్రుడు, కొల్లి రాంబాబు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ, నాగేశ్వరరావు, సప్తపది పారాయణదారు టీవీఎస్.శాస్త్రీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అత్తిలి: మంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో శరీరం నుంచి తల వేరైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుంది. అతని వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

నేత్రాలు, శరీరం దానం



మామిడి వరలక్ష్మి(ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన మామిడి వరలక్ష్మి (89) గురువారం రాత్రి మృతి చెందగా ఆమె చివరి కోరిక మేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆమె నేత్రాలు, దేహాన్ని కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు ఆమె నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి ఇద్దరు అంధులకు కంటి చూపు వచ్చే ఏర్పాటు చేశారు. ఆమె దేహాన్ని నగరంలోని ఆశ్రం వైద్య కళాశాలకు అందజేశారు. ఆమె దేహాన్ని దానం చేసిన కుటుంబ సభ్యులకు మానేపల్లి రామారావు ధన్యవాదాలు తెలిపారు.

కోర్టు ఉద్యోగి ఆత్మహత్య

నూజివీడు: పట్టణానికి చెందిన కోర్టు ఉద్యోగిని కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందిగామ కోర్టులో విధులు నిర్వహించే పోతురాజు సీతారాణి(46) పట్టణంలోని ఇంట్లో ఉండగా గురువారం రాత్రి విపరీతమైన కడుపులో నొప్పి రావడంతో భరించలేక ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ పీ.సత్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

45 కోడి పుంజుల చోరీ

ద్వారకాతిరుమల : మండలంలోని రాళ్లకుంటలో 45 కోడి పుంజులు చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన బాధిత యజమాని స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం. ద్వారకాతిరుమలకు చెందిన ములకాల పానకాలు రాళ్లకుంట రెవిన్యూ పరిధిలోని తన వ్యవసాయ భూమిలో నాలుగేళ్లుగా నాటు కోళ్లను పెంచుతున్నాడు. ప్రతి రోజు అక్కడే పనులు చేసుకుంటూ వాటిని చూసుకుంటున్నాడు. రాత్రి సమయాల్లో సైతం అతడే కాపలాగా ఉంటున్నాడు. అయితే గురువారం రాత్రి తమ బంధువు చనిపోయాడని ఇంటికి వెళ్లిన పానకాలు, తిరిగి శుక్రవారం ఉదయం కోళ్ల మకాం వద్దకు వచ్చాడు. అయితే 100 నాటు కోళ్లు, 45 కోడి పుంజులు కనిపించలేదు. దాంతో అవి చోరీకి గురైనట్టు తెలుసుకుని స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: కొడుకు, కోడలు, వియ్యంకుడు తనపై దాడి చేసినట్లు బవిరిశెట్టి మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన భవిరిశెట్టి మణి తన కుమారుడును చూసేందుకు కొడుకు ఇంటికి వెళ్లింది. అయితే ఇంట్లో ఉన్న కోడలు భవిరిశెట్టి సునీత ఇంటికి ఎందుకు వచ్చావని గొడవపడి ఇంట్లో నుంచి గెంటి వేయడంతో పాటు, కర్రతో దాడి చేసింది. కుమారుడు రామకృష్ణ కూడా మణిపై దాడి చేశాడు. మణి వియ్యంకుడు సైతం దుర్భాషలాడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


కలుషిత ఆహారం తిన్న 11 మందికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

పెదపాడు: వట్లూరులో టీటీడీసీ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న 11 మంది అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు భోజనం చేశాక అస్వస్థతకు గురవడంతో.. వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు.

గద్దర్‌కు నివాళులు



గద్దర్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : దేశ చరిత్రలోనే సాహిత్యాన్ని నటన రూపంలో చూపిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌డీ పాల్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ గుర్తు చేశారు. విప్లవ కవి గద్దర్ 76వ జయంతి సందర్భంగా స్థానిక ఎన్‌ఆర్ పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్‌కు నివాళి అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహిత్యాన్ని నటన రూపంలో చూపి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిన గొప్ప గాయకుడు గద్దర్ అని కొనియాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటే మనకు వజ్రాయుధం అని దాన్ని ఎవరూ అమ్ముకోవద్దంటూ ప్రజల్ని పాటల ద్వారా చైతన్యపర్చిన గొప్ప కళా తపస్వి, సాహిత్య వేత్త అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పులవర్తి డేవిడ్, తెనాలి సురేష్, కనికెల్లి రవి, కనికెల్లి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- రహదారి అంచులే డంపింగ్ యార్డులు
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్' స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్
- నియోజకవర్గాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు


కె. పెంటపాడులో రోడ్డు పక్కనే డంపింగ్ యార్డు


కె. పెంటపాడులో సామూహిక మరుగుదొడ్ల వద్ద అధ్వానంగా ఉన్న దృశ్యం


కె. పెంటపాడు పాత ఎస్సీపేటలో మురుగునీటిని చూపుతున్న స్థానిక మహిళ


అలంపురం జెడ్పీ స్కూల్ వద్ద పరిశుభ్రత లేక అధ్వానంగా ఉన్న రహదారి

పెంటపాడు: పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. అధికార సందిగ్ధత నెలకొనడంతో గ్రామాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక సంస్థలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఒక పార్టీకి చెందిన వారు ఉండగా రాష్ట్రంలో మరోక పార్టీ అధికారంలో చెలాయిస్తుంది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులను స్వచ్ఛంగా అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు చేయనీయకుండ అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు తామే చేయాలని, తమకు తెలియకుండా ఏ పని జరగకూడదంటూ అనాధికారికంగా హుకుం జారీ చేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు బిల్లులు చేయరేమోనని స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతుండగా పెట్టుబడి తామేందుకు పెట్టాలంటూ అధికార పార్టీ నాయకులు భీష్మించుతున్నారు. దీంతో ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. అరకొరగా చేస్తూ కాలాన్ని నెట్టుకువస్తున్నారు. ఇద్దరి మధ్యలో సచివాలయ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెంటపాడు మండలంలోని చాలా గ్రామాల్లో అపారిశుద్ధ్యం నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాఫీ, బోజనం హోటళ్ల వంటి వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకొని వచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్ల, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈచెత్తనుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో లంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

5న వైఎస్సార్ సీపీ 'ఫీజు పోరు'


వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ ఫీజు పోరుబాటను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లల చదువులు భారం కాకూడదనే ఉద్దేశంతో దివంగత వైఎస్సార్ రూపకల్పన చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. పేదరికంలో ఉన్న విద్యార్థులు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఫీజు పోరు కార్యక్రమాన్ని ఈనెల 5వతేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరతూ వినతిపత్రాలు ఇస్తామని మంత్రి కొట్టు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్లను కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శాంతిభద్రతలను తాము అధికారంలో ఉండగా కాపాడామని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాడేపల్లిగూడెంలో పేకాట, కోడిపందాలు, గుండాటలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలకు తాను తెచ్చిన నిధులతోనే చేపట్టారని తెలిపారు. గతంలో చిలకంపాడు – వెంకట్రామన్నగూడెం రోడ్డు వేసేందుకు రూ.48 కోట్లు నిధులను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని ప్రస్తుతం అభివృద్ధికి సహకరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, బండారు నాగు, చెన్నా జనార్దన్, వెలిశెట్టి నరేంద్రకుమార్, బొద్దాని శ్రీనివాస్, జడ్డు హరిబాబు, గోకా వెంకటేశ్వరరావు, అరిగెల అభిషేక్, పాలూరి శివ, దాసిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


ఏపీ నిట్‌లో రక్తదానం దృశ్యం

తాడేపల్లిగూడెం: ప్రతీ రక్తపు బొట్టు ఆయువు పట్టు వంటిదని పలువురు వక్తలు తెలిపారు. నిట్‌లో శుక్రవారం డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, ప్రయత్నం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రక్తదానం కార్యక్రమంలో ఏపి నిట్ రిజిస్ట్రార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రక్తదాత ప్రాణదాతతో సమానమన్నారు. తల్లి జన్మనిస్తే, రక్తదాత పునర్జన్మను ఇస్తారన్నారు. ఆపదలో ఉన్నవారికి సరైన సమయానికి రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం చేసి నిండుప్రాణాలను కాపాడటంతో పాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. రక్తదానం చేస్తే నీరసించిపోతామన్న అపోహలను విడనాడాలన్నారు. డీన్ అకడమిక్ ఎన్.జయరామ్, డాక్టర్ రాముడు, ఏలూరు జనరల్ ఆసుపత్రి వైద్యాధికారిణి పావని తదితరులు పాల్గొన్నారు. 244 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ బి.రూపేష్‌కుమార్ బహుమతులను అందజేశారు.

దివ్యాంగులను ఆదరించాలి


దివ్యాంగుల పిల్లలతో భవిత సెంటర్ నిర్వాహకులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలను వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు పేర్కొన్నారు. భవిత సెంటర్‌లో శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచితంగా కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. బాలీశ్వయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు, అలవెన్సులు, రవాణా చార్జీలు, ఎస్కార్ అలవెన్స్‌లు, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ స్టఫ్ అండ్, రీడర్స్ అలవెన్స్, బోధన సామగ్రి అందజేస్తారని చెప్పారు. ప్రత్యేక విద్య, స్పీచ్ తెరపీ, ఫిజియోథెరపీలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోతి మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు భవిత కేంద్రంలో కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించడం ద్వారా వారి అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పెంటపాడులో నిల్వ పరిసరాలను తొలగిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 34, 35 వార్డుల్లో శుక్రవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ప్రజారోగ్య పరిరక్షణ కోసం, దోమ లార్వాను కనుగొనుటలో హెల్త్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు తప్పక అర్బన్ హెల్త్ సెంటర్‌లకు వచ్చి వైద్య పరీక్షలు, మందులు తీసుకోవాలని, ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటిస్తే వ్యాధులు దూరం

పెంటపాడు: ప్రజలు ఆరోగ్య నియమాలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు తెలిపారు. పెంటపాడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పరిమెళ్ల, పెంటపాడులో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్, ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల అమలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం సిబ్బందికి కూడా పలు సూచనలు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు విజయకుమారి, ప్రసన్న నిర్మల, అన్నపూర్ణ ఆశా కార్యకర్తలు, ఎల్. హెచ్. పి. రమ జి ఆరోగ్య సహాయకులు, సాయిబాబా, కృష్ణంరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా ఆశ్రమంలో మొక్కల పంపిణీ


ఉమర్ ఆలీషా ఆశ్రమంలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా పుట్టిన రోజు సందర్భంగా అత్తిలి ఆశ్రమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉమర్ ఆలీషా ఇచ్చిన పిలుపులో నామొక్క నాశ్వాస కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరూ 3 మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని స్థానిక పీఠం కన్వీనర్ నందం తాతయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఆత్మహత్యకు వేధింపులే కారణం

- వైఎస్సార్ సీపీ లీగల్ టీం సభ్యుడు సాయిబాబారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబారెడ్డి

తణుకు అర్బన్: వీఆర్‌లో ఉన్న ఎస్ఐ ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య ముమ్మాటికీ అధికారుల వేధింపులేనని వైఎస్సార్ సీపీ లీగల్ టీం సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి ఆరోపించారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు మండలం వేల్పూరులో జరిగిన గేదెల దొంగతనం వ్యవహారంలో జరిగిన డబ్బు లావాదేవీల్లో ఎస్ఐ లేకపోయినా ఆయనను వీఆర్‌కు పంపించి అధికారులు వేధించారని విమర్శించారు. గేదెల దొంగతనం కేసు విచారణలో భాగంగా గత నవంబరు నెలలో తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయంలో డబ్బు కట్టలతో ఉన్న వీడియో వైరల్ అయిన విషయం అందరికీ తెలిసిందేనని స్పష్టం చేశారు. ఆ కేసు విచారణలో భాగంగా రికవరీలో భాగంగా దొంగతనం చేసిన వారి నుంచి రూ.13 లక్షలు పైచిలుకు వసూలు చేసి రూ. 6.50 లక్షలు మాత్రమే కోర్టుకు చూపించారని చెప్పారు. మిగిలిన డబ్బు పంపకంలో ప్రస్తుత రూరల్ సీఐ కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. డబ్బు వసూలు చేసిన వ్యక్తులను వదిలేసి సంబంధంలేని ఎస్ఐను బాధ్యుడిగా చేయడం, కోర్టులో సైతం వారం రోజులపాటు తిరిగి వేదనకు గురికావాల్సి వచ్చిందని, అప్పటి నుంచి ఎస్ఐ తీవ్ర మనోవేదనకు గురైనట్లుగా చెప్పారు. ఈ కేసు వ్యవహారంలో స్థానిక రాజకీయ నాయకుల పాత్ర ఉందని, వారి ఒత్తిడి కూడా అధికంగానే ఉందని అన్నారు. ఇటీవల కాలంలో తూర్పు గోదావరి జిల్లాకు పోస్టింగ్ వేయించుకునే క్రమంలో సైతం వీఆర్ నుంచి రిలీవ్ కానివ్వకుండా జిల్లా ఎస్పీ అడ్డుపడ్డారని ఆరోపించారు. ఈ కేసులో ఎంతటి పెద్ద స్థాయి అధికారులు ఉన్నప్పటికీ బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, జరగని పక్షంలో హైకోర్టులో వాజ్యాన్ని దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఆత్మహత్య ఘటనపై ప్రత్యేక సిట్ వేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం ఎస్సై ఏజీఎస్ మూర్తి మృతి పట్ల పార్టీ శ్రేణులు రెండు నిమషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, నాయకులు వి.సీతారాం, మారిశెట్టి శేషగిరి, కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మందేశ్వరస్వామి ఉత్సవాలను విజయవంతం చేయండి

పెంటపాడు: మండలంలోని వల్లూరుపల్లి మందేశ్వరస్వామి (శనైశ్చరుడు) పునః ప్రతిష్ఠ ఉత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వేదుల వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ ఈఓ చీమలకొండ సాయితో కలిసి ఆయన ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ దేవాలయం శిథిలావస్థకు చేరడంతో గత దేవాదాయశాఖ మంత్రి, మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ రూ.1.70లక్షలు ఆలయ నిర్మాణానికి నిధులు అందజేశారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, ప్రతిష్ఠాపన పూజలు పరిమెళ్లకు చెందిన బాదంపూడి ఫణిశర్మ బ్రహ్మత్వంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ దంగేటి రామస్వామి, పుల్లా బాబి, పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పురుషోత్తం సేవలు మరువరానివి

అత్తిలి: ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి సంస్కృత ఉపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం అభినందనీయుడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అత్తిలి మండల బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన సోమంచి పురుషోత్తం దంపతులను శుక్రవారం పాఠశాల తరపున సత్కారం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభకు అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ఎం బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ప్రగతికి పురుషోత్తం చేసిన కృషి మరువరానిదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, కె ఫణిశ్రీ, ఎన్ వెంకటరమణ, కె శ్రీరామశర్మ, రామకృష్ణయ్య, జి నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు జి శ్రీనివాసరావు, శ్రీకాంత్, సుజాతదేవి, రాంబాబు, ఆత్మలింగం, అన్నపూర్ణ, రమేష్‌బాబు, ఎస్ఎంసీ చైర్మన్ పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవునికి విధేయులై జీవించాలి

పెంటపాడు: తణుకు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్(ఈపీఎఫ్)లో ఈనెల 30 నుంచి జరుగుతున్న సమావేశాలు శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరస మోజస్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేవునికి విధేయులై జీవించాలన్నారు. ముగింపు రోజైన శనివారం రాత్రి 9 గంటలకు సంపూర్ణ రాత్రి ప్రార్థన జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

రామన్నగూడెం శివాలయంలో విశేష పూజలు


రామన్నగూడెం ఉమారామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం శాంతి కల్యాణాలను జరిపారు. ఆలయ అర్చకులు కాశీబొట్ల సాయి బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరవెంకట సత్యనారాయణ, మరో 19 మంది కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాసవీమాతకు పంచామృత అభిషేకాలు


విశేష అలంకరణలో వాసవీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వాసవీ అమ్మవారికి మాఘశుద్ధ విదియ సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, కలశ పూజ, 108 వెండి కలశాలతో పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, పండ్ల రసాలతో, పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి పుష్పాలతో విశేష అలంకరణ గావించారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేంద్రసింగ్ నాయక్

తాడేపల్లిగూడెం: వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ డి.సురేందర్ సింగ్ నాయక్ ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్షణ పద్ధతిలో నియమాలను పాటిస్తూ వాహనచోధకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యాసంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు, క్లీనర్లు తీసుకోవాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ హనుమలక్ష్మి యాక్సిడెంటు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.కృష్ణలు పాల్గొన్నారు.

న్యూ డెస్టినీ-125 స్కూటర్ మార్కెట్లోకి విడుదల


షోరూమ్‌లో నూతన స్కూటర్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆధునిక సాంకేతికత హంగులతో హీరో మోటోకార్ప్ రూపొందించిన న్యూ డెస్టినీ–125 స్కూటర్ మార్కెట్‌లోకి వచ్చిందని పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శుక్రవారం పట్టణంలోని శ్రీ దానేశ్వరీ హీరో షోరూం వద్ద న్యూ డెస్టినీ స్కూటర్‌ను మార్కెట్లోకి పవేశపెట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. న్యూ డెస్టినీ స్కూటర్‌లో సేఫ్టీ టెక్నాలజీ, సౌకర్యవంతమైన ప్రయాణానికి అవసరమైన అనేక సౌకర్యాలతో రూపొందించడంతో విద్యార్థులు, ఫ్యామిలీ, వ్యాపారులకు అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, గట్టిం మాణిక్యాలరావు, యెగ్గిన నాగబాబు, పాలూరి వెంకటేశ్వరరావు, గమిని రాజా, మానేపల్లి కాశీ విశ్వనాథ్, బొల్లా సత్యనారాయణ, ఓనర్ బొల్లా సతీష్ కుమార్, కంపెనీ ప్రతినిధులు భార్గవ్, ప్రవీణ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వాసవి ఇంటర్నేషనల్ అనుసంధానంగా ఉన్న తాడేపల్లిగూడెం వాసవి వనిత క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం జరిగింది. అధ్యక్షురాలిగా చొప్పర్ల రుక్మిణి, కార్యదర్శిగా కారుమూరి సునీత, కోశాధికారి నున్న సత్యప్రియలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు వోలేటి శ్రీనివాస్ గుప్తా ఉన్నారు.